క్లుప్తంగా

పండ్ల పంపిణీ



శాయంపేట : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో 20మంది జాగృతి నాయకులు రక్తదానం చేశారు. మహమ్మద్ పాషా, మారెపల్లి మోహన్, అరికిల్ల ప్రసాద్, విజయ్, తిరుపతిరెడ్డి, విజేందర్, సుమన్, గోపి పాల్గొన్నారు.

పరామర్శ

వేలేరు : అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ జెడ్పీటీసీ చాడ సరితను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని అధైర్య పడొద్దని, భవిష్యత్‌లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కాల్ సెంటర్‌లో ఉద్యోగావకాశాలు

రాయపర్తి : దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలోని కాల్ సెంటర్లలో 100 ఉద్యోగావకాశాలున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్ కార్యాలయాల్లో 50 మంది చొప్పున స్త్రీ, పురుషులను నియమిస్తామని పేర్కొన్నారు. రూ.12 వేల వేతనం తోపాటు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 95056 82726 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హసన్‌పర్తి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై రవి సూచించారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై హసన్‌పర్తి శివారులోని ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో గురువారం కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో పట్టుబడితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, 100 డయల్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్, కళాజాత బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు వినలియ్, వెంకటేశ్వర్లు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా రాకపోకలు

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) మరమ్మతుల అనంతరం గురువారం తెరుచుకోగా రాకపోకలు యథావిధిగా సాగినట్టు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిడ్జిలో గుంతలు తేలి ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో రైల్వే అధికారులు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు పనులు చేయించారని పేర్కొన్నారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు పునరుద్ధరించినట్టు వివరించారు. ఎల్గూర్ రంగంపేట, పరిసర గ్రామాల ప్రజలు సహకరించారంటూ కృతజ్ఞతలు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు

సంగెం : మహిళలు మానవ అక్రమ రవాణపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై ఎల్.నరేశ్ కోరారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు, వీఓ అధ్యక్షులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కొందరు మోసపూరిత వ్యక్తులు అమాయకులను టార్గెట్ చేసి బాండెడ్ లేబర్‌గా, సెక్స్ వర్కర్లుగా మార్చుతున్నారని చెప్పారు. అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదరికాన్ని ఆసరా చేసుకుని అసహాయులైన కొందరు మహిళలు, బాలికలను ఉద్యోగ అవకాశాల పేరుతో డబ్బు ఆశ చూపి వివిధ నగరాల్లో అమ్ముతున్నారని తెలిపారు. చిన్నారులను కిడ్నాప్ చేసి భిక్షాటన చేయిస్తున్న, అవయవాల మార్పిడికి పాల్పడుతున్న, లైంగిక వాంఛ తీర్చుకుంటున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కల్యాణి, కార్యదర్శి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి శోభాయాత్ర

దుగ్గొండి : కేశవాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం యాగశాలలో నిత్యారాధన, మహా కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ట, ధ్వజాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి ధ్వజారోహణ చేశారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను శేషవాహనంపై కేశవాపురం నుంచి నీరుకుళ్ల వరకు శోభయాత్ర నిర్వహించారు.

వృథాగా ఎస్సారెస్పీ జలాలు

కాల్వ పైనుంచి ప్రవహిస్తున్న నీరు
- కెనాల్ కాల్వ, రైల్వేట్రాక్‌కు పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో గ్రామస్తులు, అన్నదాతలు



డీబీఎం-18 కాల్వ పైనుంచి ప్రవహిస్తున్న నీరు

కమలాపూర్ : ఒక వైపు చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతుంటే.. మరోవైపు కాల్వ సామర్థ్యం కంటే అధికంగా నీటిని విడుదల చేయడంతో కాల్వ పైనుంచి సాగు నీరు ప్రవహిస్తూ వృథాగా పోతోంది. ఈ ఘటన మండలంలోని భీంపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. భీంపల్లి గ్రామస్తులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా యాసంగి పంటలకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. అయితే కాల్వ సామర్థ్యం కన్నా ఎక్కువ నీటిని విడుదల చేయడంతో భీంపల్లి శివారులో ఉన్న ఎస్సారెస్పీ డీబీఎం-18 కాల్వ పైనుంచి నీరు ప్రవహిస్తూ వృథాగా పోతోంది. కాల్వ పైనుంచి సాగునీరు ప్రవహిస్తున్న కారణంగా ఎస్సారెస్పీ కాల్వ తెగిపోయే ప్రమాదంతో పాటు ఆ కాల్వ సమీపంలోనే ఉన్న రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. దీంతో గ్రామస్తులతో పాటు స్థానిక అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాల్వలపై ఎస్సారెస్పీ అధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శిస్తున్నారు. సామర్థ్యానికి మించి ఇష్టారాజ్యంగా నీటిని విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటిని తగ్గించి కాల్వలపై పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



ఎల్కతుర్తి: పట్టుబడిన బియ్యాన్ని చూపుతున్న ఎస్సై సాయిబాబు



కమలాపూర్: పట్టుబడిన రేషన్ బియ్యంతో పోలీసులు

ఎల్కతుర్తి : భీమదేవపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని ఎస్సై సాయిబాబు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పూర్ గ్రామంలోని గగ్గిరెడ్డుల కాలనీకి చెందిన బత్తుల రాజయ్య ఇంటి వద్ద నిల్వచేసిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు చెప్పారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉప్పల్‌లో 13.5 క్వింటాళ్లు..

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో నిల్వచేసిన 13.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. మండలంలోని ఉప్పల్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు మట్ట రమేశ్, అశోక్ ఇళ్లపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో రూ.33,750 విలువ గల 13.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం కమలాపూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా నిందితులిద్దరు పరారైనట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, ఎస్సై వి.దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

వాగు కాల్వ హద్దుల ఏర్పాటు



పంథినిలో భూ సర్వే చేస్తున్న అధికారులు

ఐనవోలు : మండలంలోని పంథిని నల్లమారెమ్మ వాగుకు హద్దులు ఏర్పాటు చేయడానికి గురువారం అధికారులు సర్వే నిర్వహించారు. పంథిని శివారు వాగుకు ఆనుకుని ఉన్న స్థలంలో ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టగా కొన్ని రోజులుగా గ్రామస్తులకు, ఫంక్షన్ హాలు యజమానికి వివాదం కొనసాగుతోంది. గురువారం సర్వే నంబర్ 322లో 2.32 ఎకరాలు, 323లో 18.13 ఎకరాల భూమి ఉందని హద్దులు ఏర్పాటు చేసినట్లు సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు తెలిపారు. ఈ సర్వే నంబర్ల మధ్య కొంత మేర వాగు ఉందని, కొంత మేర వాగు మ్యాప్‌లో లేదని అధికారులు వివరించారు. వాగుకు హద్దులు నాలాను ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేస్తారని సర్వే ల్యాండ్ అధికారులు తెల్పి చెప్పారు.

పుట్టిన ఊరిపై మమకారంతో..

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఔదార్యం చాటుతున్న రాజుగౌడ్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాగపురి రాజుగౌడ్

కమలాపూర్ : మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన నాగపురి రాజుగౌడ్ పుట్టిన ఊరిపై మమకారంతో గ్రామానికి, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలకు ఏదైనా చేయాలని సంకల్పించాడు. ఆలోచన రావడంతోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాడు. గుండేడులో బస్ షెల్టర్ నిర్మాణంతో పాటు పోచమ్మ ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చాడు. చిన్ననాటి తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల తరగతి గదులకు అవసరమైన తలుపులు బిగించడంతో పాటు పెయింటింగ్ వేయించాడు. అదేవిధంగా 2001-02లో పదో తరగతి పూర్తి చేసిన కన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పెయింటింగ్ వేయించడానికి ముందుకొచ్చాడు. సుమారు రూ.6 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఆయా పనులకు గురువారం గ్రామస్తులతో కలిసి ప్రారంభించాడు. త్వరితగతిన ఈ పనులన్నీ పూర్తి చేసి భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని రాజుగౌడ్ తెలిపారు. పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతూ ఔదార్యం చాటుకుంటున్న రాజుగౌడ్‌ను పలువురు అభినందించారు. కన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం కె.లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజుగౌడ్‌ను సన్మానించారు. పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, మాజీ ప్రజాప్రతినిధులు లాండిగె కల్యాణిలక్ష్మణ్‌రావు, మారపెల్లి నవీన్‌కుమార్, మాట్ల రమేష్, ఉపాసి తిరుపతిరావు, వీరమనేని భాస్కర్‌రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ పద్మఅశోక్, నాగపురి సాంబయ్య, మేకల రవి, ఓదెలు, చిన్న సాంబయ్య, నాంపెల్లి ప్రభాకర్, పల్లె సంతోష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్, నినాదాలు చేస్తున్న పద్మశాలీలు

- అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్

శాయంపేట : చేనేత కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో గురువారం పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు బాసని ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నరేందర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 50ఏళ్లు నిండిన చేనేత కార్మికులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని, అంత్యోదయ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, నేతన్న బీమా పథకాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అఖిల భారత పద్మశాలి సంఘాన్ని 1921లో స్థాపించాడని అప్పటి నుంచి అనేక ఉప శాఖలుగా ఏర్పడి సహకార సంఘాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించిన త్యాగధనుడు లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. జియో ట్యాగ్‌తో సంబంధం లేకుండా మగ్గం నేసే ప్రతి కార్మికుడికి వైద్యసదుపాయాలు కల్పించాలని కోరారు. హనుమకొండ జిల్లాలో అందరికి సభ్యత్వాలు చేర్పించాలని సభ్యత్వ రుసుము రూ.10లు అని తెలిపారు. అనంతరం పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేశ్ మాట్లాడారు. పద్మశాలీల ఐక్యతకు పని చేస్తానని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్‌గా వంగర సాంబయ్య, కోకన్వీనర్‌గా వడ్డెపల్లి శ్రీనివాస్, బాసని సాయితేజలను నియమించారు. కార్యక్రమంలో అఖిల భారత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్, వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, నాయకులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ బహూకరణ



ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లి ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు గురువారం బెంచీలు, టేబుళ్లను బహూకరించారు. కాగా కంపెనీ యజమాన్యాన్ని, ప్రతినిధులను హెచ్‌ఎం దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ రవికుమార్, స్థానికులు అభినందించారు. కంపెనీ ఎండీ, సీఈఓ వెంకట్రాం వసంతవాడ, రాజేంద్రసింగ్ మహల్, గన్‌శ్యామ్ చంద్రసింగ్, మిల్టన్ ఫెర్నాండెజ్ మోసెస్, సత్యనారాయణ, లాలాజీ, మోహన్‌రావు పాల్గొన్నారు.

తాటిచెట్ల నరికివేత



ఐనవోలు : తమకు జీవనాధారమైన తాటిచెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐనవోలు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు గురువారం వరంగల్ ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని అమరవాది రమేశ్ భూమిలోని 50 తాటిచెట్లను ఎలాంటి సమాచారం లేకుండా నరికివేశారని కల్లుగీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. తాటిచెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తీగల లక్ష్మణ్ గౌడ్, ఆగపాటి సదానందం, గడ్డం రఘువంశీ, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తురక కాశోళ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ఆత్మకూరు : రాష్ట్రంలోని తురక కాశోళ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్‌వలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ముస్లిం తెగలో అత్యంత వెనకబడిన తెగ తురక కాశ తెగ అని అన్నారు. రూ.వెయ్యి కోట్లతో బడ్జెట్ కేటాయించాలని అన్నారు.

'మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శాయంపేట : భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రాంశెట్టి లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డిలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. చలివాగు ప్రాజెక్టులో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి చేపల వ్యాపారం చేశారని పూర్తిగా అవాస్తవమని చెప్పారు. ఈఎన్సీ అధికారులు దేవాదుల జోగంపల్లి పంప్‌హౌజ్‌కు వచ్చినప్పుడు అధికార పార్టీ నాయకులు గేటుకు తాళం వేసి అధికారులను నిర్బంధించి నిరసన తెలిపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి సమక్షంలో దేవాదుల పై జరిగిన రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చలివాగుపై ఎందుకు నోరు మెదపకుండా మౌనం వహించారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మచ్చలేని నాయకుడని కొనియాడారు. నాయకులు మారెపల్లి నందం, మోహన్, గాజె రాజేందర్, కొమ్ముల శివ, అరికిల్ల ప్రసాద్, వల్ప దాసు చంద్రమౌళి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, గడిపె విజయ్‌కుమార్, రంగు మహేందర్, కరణ్‌బాబు, దేవయ్య, కూతాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ధర్మసాగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడాదిలోనే నియోజక వర్గ అభివృద్ధి కోసం రూ.800 కోట్ల విలువైన పనులకు మంజూరు తీసుకు వచ్చానని గుర్తు చేశారు. ఈ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయించడంతో పాటు నియోజక వర్గంలో ఇంకా చేపట్టాలిసిన అభివృద్ధి పనుల వివరాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి మరిన్ని ఎక్కువ నిధులు మంజూరు తీసుకోవడమే లక్ష్యంగా భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మాజీ ప్రజా ప్రతినిధులు రాజుగారి రఘు, తోట నాగరాజు, పెసరు రమేశ్, చాద నర్సింహారెడ్డి, ఎర్రబెల్లి శరత్, మునిగాల యాకూబ్, సత్యనారాయణ, రాజారపు యాదగిరి, జాలిగపు దుర్గయ్య, ప్రదీప్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు పనిలేక మాట్లాడుతున్నారు

వేలేరు : ప్రతిపక్షాలకు పనిలేక, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పిచ్చిపట్టి మాట్లాడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న గండి లిఫ్ట్ పనులు త్వరలోనే పూర్తి చేసి జూన్‌లోగా మండలానికి సాగునీరు తీసుకువస్తానని, మండల కాంప్లెక్స్‌ల నిర్మాణానికి భూమిపూజ చేస్తానని లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లడగనని పేర్కొన్నారు. అలాగే వేలేరు, ధర్మసాగర్ మండలాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మాజీ ఎంపీపీ సమ్మిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు బిల్లా యాదగిరి, మల్లికార్జున్, రాజిరెడ్డి, రాంచందర్, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్ నాయక్, సంపత్, మధు, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, శ్రీకాంత్, రాజేందర్, సలీంమాలిక్, వెంకటేశ్వర్లు, లింగం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ




విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న మధుకర్

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం అదే పాఠశాల పూర్వ విద్యార్థి, బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ మధుకర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



దామెర: దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూరు: సంఘీభావం తెలుపుతున్న నాయకులు



ఐనవోలులో సారంగపాణి తదితరులు

దామెర : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం రెండోరోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ప్రక్రియ పూర్తికాక ముందే ఉద్యోగాల నియమకాలు చేపట్టొద్దని తెలిపారు. గ్రూప్-1, 2 పరీక్షల ఫలితాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. మంత్రి వర్గంలో ఇద్దరు మాదిగలకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల శ్రీనివాస్, కొడకండ్ల శ్రీనివాస్, సంఘాల భరత్, జన్ను సాంబయ్య, వీరెల్లి హరీష్, ప్రశాంత్, రతన్‌కుమార్, సతీష్, జైపాల్, వేల్పుల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్గీకరణ హామీని నిలబెట్టుకోవాలి

ఐనవోలు : ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీసీ సంఘం నాయకుడు అమరవాది సారంగపాణి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. బీసీ సంఘం నాయకుడు దీక్ష శిబిరానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో మంద కృష్ణమాదిగ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ ఉపకులాలను కలుపుకుని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షకు ప్రవీణ్, బర్ల బాబు, సంజీవ, బుర్ర రాజు, హన్మంతచారి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే దీక్షలు గురువారం కొనసాగాయి. దీక్షలకు వివిధ సంఘాల నాయకులు దుండి కుమార్, నాతని ప్రవీణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు.

ప్రభలు దూరం పాటించాలి

- డీసీపీ అంకిత్‌కుమార్

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర నేడు (శుక్రవారం) ప్రారంభం కానుండగా ఈసారి జాతరలో వైరి పార్టీలతో కాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదం నెలకొంది. కొండా, రేవూరి వర్గాలు ప్రభ బండ్లను సిద్ధం చేస్తున్నాయి. ఎవరిది ముందుండాలనే విషయంలో వివాదం నెలకొనడంతో డీసీపీ అంకిత్‌కుమార్ ఇరువర్గాలకు దిశానిర్దేశం చేశారు. రేవూరి వర్గం ప్రభ ముందు, దానికి వంద మీటర్ల దూరంలో కొండా వర్గం ప్రభలు ఉండాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ అద్దంకి దయాకర్ తెలిపారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. డీపీఓ కల్పన, డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీఓ ప్రభాకర్ జాతర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను సమీక్షించారు. దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సునీత, అధికారి అనిల్ ఆలయ పరిసరాల్లో పర్యటించి జాతర విజయవంతానికి సూచనలు చేశారు.